క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



వాదాలకుంటలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ నాయక్, ఎస్సైలు మనోహర్, శివ గణేష్

గోపాలపురం: రాజకీయ నాయకుల విగ్రహాలు, వివిధ పార్టీ నాయకులు ఫ్లెక్సీల ఏర్పాటుతో గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందని దానిని ఎట్టి పరిస్థితుల్ల ఉపేక్షించమని దేవరపల్లి సీఐ కె.నాగేశ్వర్ నాయక్ అన్నారు. మండలంలోని వాదాలకుంట గ్రామస్తులకు బుధవారం వివిధ కేసులు, వాటి వివరాలపై అవగాహన కల్పించారు. గ్రామస్థాయిలో నేరాలు నియంత్రణకు సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామని, చట్టాలకు ఎవరూ అతీతం కాదని వివరించారు. ఎస్సైలు పి.మనోహర్, పి.శివ గ్రామస్తులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం

నల్లజర్ల: మాజీ రాష్ట్రపతి డాక్టరు ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మెగా రక్తదాన శిబిరాన్ని స్థానిక ఎలైట్ విద్యాసంస్థలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ఏలూరు ప్రభుత్వ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో 31 మంది విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఎలైట్ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కలగర శ్రీలక్ష్మి 11వసారి రక్తాన్ని దానం చేశారు. క్యాంపు నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తమ్మిన శ్రీనివాసరావు, పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షుడు సీమకుర్తి ప్రసాద్, ఎలైట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ గారపాటి సుబ్బారావు, బ్లడ్ బ్యాంకు డాక్టరు సోనియామోహన్, జయలక్ష్మి పాల్గొని రక్తదాతలను అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని దూబచర్ల రావిచెట్టు సెంటర్లో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితుడు కంచర్ల చిననాగు కుటుంబానికి మండల మానవత సంస్థ రూ.10 వేలు ఆర్థిక సాయంగా అందజేసింది. కార్యక్రమంలో సీమకుర్తి ప్రసాద్, ఉపసర్పంచ్ కాసాని బాటయ్య, మండల కార్యదర్శి ప్రత్తిపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

నల్లజర్ల: సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిసోసియేషన్)పై అందరికీ తప్పనిసరిగా అవగాహన ఉండాలని నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇన్‌చార్జ్ డాక్టరు మనోజ్ అన్నారు. సీపీఆర్ వారోత్సవాలలో భాగంగా బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టు అయినప్పుడు వారికి సీపీఆర్ చేసినట్లయితే ప్రమాదం నుంచి కాపాడగలుగుతామన్నారు. ఇది లేకపోవడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని, సీపీఆర్ ట్రైనింగ్ సడన్ కార్డియాక్ అరెస్టు అయినప్పుడు ప్రథమ చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఎస్.వెంకటశాస్త్రి, ఎంపీహెచ్ఎస్ ఏ.సత్యనారాయణ, కే.హెప్సిబా, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పోచవరంలో స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

తాళ్లపూడి: మండలంలోని పోచవరంలో మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న 36 బస్తాలు రేషన్ బియ్యం(పీడీఎస్ రైస్)ను సివిల్ సప్లై అధికారులు బుధవారం పట్టుకున్నారు. డీఎస్వో పార్వతి ఆధ్వర్యంలో పోచవరంలో ఓ ఇంటిలో రహస్యంగా ఉంచిన 50 కేజీల బస్తాలు 36 ఉన్నట్లు వచ్చిన సమాచారంతో సివిల్ సప్లై అధికారులు దాడులు జరిపారు. 18 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని స్థానిక డీలర్‌కు అప్పగించి, రైస్ దాచిన గుర్రాల పోసియ్య అనే వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేశామని మండల సివిల్ సప్లై డీటీ దివాకర్ తెలిపారు. ఈ దాడుల్లో డీఎస్వో పార్వతి, ఏఎస్వో నాగాంజనేయులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మహ్మద్ జవహర్

గోపాలపురం: లారీ ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పంగిడి గ్రామం నుంచి కరిచర్లగూడెం ఓంకార్ ఫెర్టిలైజర్స్‌లో పనిచేస్తున్న మహ్మద్ జవహర్ (45) మోటార్ సైకిల్‌పై విధులకు వస్తుండగా గోపాలపురం గ్రామ శివారు ఇటుకల బట్టీ వద్ద ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో జవహర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై పి.మనోహర్ తెలిపారు. గత సంవత్సర కాలంగా ఓంకార్ ఫెర్టిలైజర్స్‌లో వెల్డర్‌గా పని చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

ఇళ్లు ఎప్పుడిస్తారు బాస్!

- స్థలాలు ఇచ్చి ఇళ్లు మరిచారు
- మంజూరు కోసం ఏడాదిన్నరగా ఎదురుచూపు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



పెరవలిలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

పెరవలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా.. నేటి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కాలం అవుతున్నా ఒక్క ఇల్లు మంజూరు కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకోవాలని అధికారులు వారిపై ఒత్తిడి తేవటం తప్ప చేసింది ఏమీ లేదు. దీంతో ఇళ్లు నిర్మించుకోవాలనుకునే లబ్ధిదారులు ఇళ్ల మంజూరు కోసం కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారు.

ఎంతమందికి పట్టాలు ఇచ్చారంటే?

నిడదవోలు నియోజకవర్గంలో పేదలకు 8,237 మందికి పట్టాలు ఇచ్చి ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఇందులో అప్పటి ప్రభుత్వం 4,380 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. ఈ ప్రభుత్వం ఏర్పడి సుమారు 15 నెలలు గడుస్తున్నా ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయకపోవటంతో లబ్ధిదారులు స్థలం ఉన్నా ఉపయోగం లేకుండా పోయిందని దీనంగా చెబుతున్నారు. ప్రభుత్వాలు మారినా పేదలకు ఇవ్వవాల్సిన లబ్ధి ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. గతంలో ఒక్కొక్క ఏడాది ఇళ్ల మంజూరు జరిగినా ఈ ప్రభుత్వంలో ఎందుకు జరగట్లేదని ప్రశ్నిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లు కట్టుకోవాలంటూ అధికారులు లబ్ధిదారుల చుట్టూ తిరిగితే, నేటి ప్రభుత్వంలో అధికారుల చుట్టూ లబ్ధిదారులు తిరిగినా ఫలితం లేకుండా పోతుందని వాపోతున్నారు. వచ్చే ఏడాదైనా ఇళ్లు మంజూరు చేస్తారో లేదో తెలియట్లేదని ఆందోళన చెందుతున్నారు. ఇళ్లు ఇచ్చినా ముడి సరకుల ధరలు పెరుగుతుండటంతో నిర్మించడం కష్టమే అని అంటున్నారు. నిడదవోలు నియోజకవర్గంలో జగనన్న కాలనీల పేరుతో 8,237 మంది లబ్ధిదారులకు స్థలాలు కేటాయించారని, ఈ ప్రభుత్వానికి ఆ పేరు ఇష్టం లేకపోతే పేరుమార్చి ఇళ్లు మంజూరు చేయాలి కదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

మండలాల వారిగా ఇళ్ల స్థలాల మంజూరు

మండలం	స్థలాలు	ఇళ్ల మంజూరు	నిర్మించుకున్నవి
పెరవలి	2715	601	403
ఉండ్రాజవరం	2610	2065	921
నిడదవోలు	2912	2254	571
మొత్తం	8237	4380	1901



అన్నవరప్పాడులో ఖాళీగా దర్శనమిస్తున్న ఇళ్ల స్థలాలు



పెరవలిలో ఇళ్ల స్థలాల్లో గడ్డి మొలిచిన దృశ్యం

నేటికీ మంజూరు కాలేదు



ఇళ్ల స్థలం ఇచ్చారు. కానీ ఇళ్లు మంజూరు నేటికీ కాలేదు. ఇళ్లు ఇచ్చి ఉంటే ఈ పాటికి వాటికి నిర్మించుకునే వాళ్లం. ఏడాదిన్నరగా ఇళ్లు మంజూరు కోసం ఎదురు చూస్తున్నాం.

– రొట్టే నవీన్ కుమార్, తీపర్రు.

స్థలాలు మాత్రమే కేటాయించారు



ఖండవల్లిలో 530 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. ఒక్కరికీ వాటిని మాత్రం మంజూరు కాలేదు. పేదలను ఇంకా పేద వాళ్లని చేయాలనా? ఇళ్లు మంజూరు చేస్తే చాలా మంది ఇళ్లు నిర్మించుకొని సొంత ఇంటి కల నెరవేరేది.

– బొక్కే వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యుడు, ఖండవల్లి.

మాటలు తప్ప చేతలు లేవు



ప్రభుత్వం మాటలు చెప్పడం తప్ప చేతలు లేవు అనటానికి ఇదే నిదర్శనం. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర అయినా నేటికీ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదంటే పేదల పట్ల ఎంత అభిమానం ఉందో దీని బట్టే అర్థమవుతుంది.

– పంజా దుర్గారావు, కానూరు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నిడదవోలు రూరల్: విద్యతోనే సమాజంలో ప్రతి ఒక్కరికీ గుర్తింపు వస్తుందని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు శాఖ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ అన్నారు. భారత మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త ఏపీజె అబ్దుల్ కలామ్ జయంతి పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మరాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రపంచ విద్యార్థుల దినోత్సవం, చేతుల పరిశుభ్రత కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. 80 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసి చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, సభ్యులు గోపిరెడ్డి శ్రీను, కోస్తూరి అప్పారావు, మారిశెట్టి అమ్మిరాజు, యాసరపు రామకృష్ణ, హెచ్ఎం హెప్సిబా, పీడీ చిక్కాల సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అబ్దుల్ కలాంలా ఆలోచించాలి

గోపాలపురం: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం కన్నట్టు ప్రతి విద్యార్థి కొత్తగా ఆలోచనలు చేసి ఒక్కొక్కరూ ఒక్కో భారతరత్నాలుగా ఎదగాలని, అబ్దుల్ కలాం జీవితం ఎంతో మంది విద్యార్థులకు, యువతకు ఆదర్శనీయమని తహసీల్దార్ కె.సాయి ప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబ్దుల్ కలాం 11వ రాష్ట్రపతిగా, మిస్సైల్ మేన్‌గా శాస్త్ర సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పును తీసుకువచ్చి దేశానికి మహోన్నత సేవలు అందించిన వ్యక్తిగా పేరుగావించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్వో జోడాల వెంకటేశ్వరరావు, మండల సర్వేయర్ రామ తులసి, ఎలక్షన్ డీటీ నల్లరాజు వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల పరిశీలన

- జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



దొమ్మేరులో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుతో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

తాళ్లపూడి (కొవ్వూరు): జిల్లాలో ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయ విధానాలను అవలంబించి, ఖర్చులను తగ్గించుకోవాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. కొవ్వూరు మండలంలోని దొమ్మేరులో బుధవారం సాయంత్రం రైతు నీరుకొండ సత్యనారాయణ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని స్వయంగా పరిశీలించి, అక్కడ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 12 ఎకరాల్లో చెరకు, బొప్పాయి, అరటి, పసుపు, కంద, డ్రాగన్ ఫ్రూట్, జామ మొక్కలను సాగు చేయడం అభినందనీయమని, ఈ రైతు పలువురికి ఆదర్శమన్నారు. జిల్లాలో మొత్తం 43 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం జరుగుతోందని, అందులో 2,300 మంది రైతులు పూర్తిస్థాయిలో ప్రకృతి పద్ధతులను అనుసరిస్తున్నారని చెప్పారు. అలాగే 18 డ్రోన్ల టెక్నాలజీ ద్వారా 7,800 మంది రైతులు 10,600 ఎకరాల్లో కషాయాలు వాడుతూ పురుగుమందుల వినియోగాన్ని తగ్గిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆవు పేడ, మూత్రం ద్వారా జీవామృతం తయారీ, ముల్చింగ్, లింగాకర్షణ బుట్టల వాడకం వంటి ప్రకృతి పద్ధతులపై కలెక్టర్ రైతులతో చర్చించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మాధవ రావు, జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జున రావు, కొవ్వూరు హార్టికల్చర్ ఏడీఏ హెచ్ఓడీ సుధీర్ కుమార్, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం తాతారావు, అదనపు డీపీఎం మహబూబ్ వలి, వ్యవసాయ శాఖ ఏడీ చింతల శ్రీనివాస్, ఏఓ గంగాధర్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

పెరవలి: గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని లేకపోతే సమస్యలు ఉత్పన్నం అవుతాయని తహసీల్దార్ నిరంజన్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, వ్యవసాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో పన్నులు వసూళ్లు, పారిశుధ్య నిర్వహణ, పీజీఆర్ఎస్, ఐవీఆర్ఎస్ కాల్స్ నివేదికలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గ్రామాల్లో అధికారులు తమకు సంబంధం లేదని కొన్ని పనులు వదలివేస్తున్నారని, దీని వల్ల సమస్యలు వస్తున్నాయని, అన్ని శాఖల అధికారులు ఒకరినొకరు అర్థం చేసుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. పంట కోత ప్రయోగాలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఇందుకోసం రెవెన్యూ అధికారులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ, వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భూములకు హద్దులు చూపాలని ఆందోళన



తమ భూములకు హద్దులు చూపించాలని ఆందోళన చేస్తున్న లబ్ధిదారులు



అక్రమంగా నరికేసిన జామాయిల్ చెట్లు

తాళ్లపూడి: తమ భూములకు హద్దులు చూపించాలని, భూములను ఆక్రమించుకొని అక్రమంగా పంటను కోసుకొని వెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం వారు ఆందోళనకు దిగారు. మండలంలోని తుపాకులగూడెంకు సంబంధించి ఆర్ఎస్ నంబర్ 49/2పిలో 28 ఎకరాలు గ్రామానికి చెందిన 28 మంది పేదలకు ఎకరం చొప్పున 2005లో ఇచ్చారు. అప్పటి నుంచి వీరికి హద్దులు చూపించకపోవడంతో రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగినా నేటి వరకు పొజిషన్ చూపలేదు. గతంలో పలుమార్లు తహసీల్దార్‌కు, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. పంటను నరకడానికి వచ్చిన వారిని లబ్ధిదారులు అడ్డుకున్నారు. లబ్ధిదారులు దాకే వెంకాయమ్మ, మార్పు అనూష, గండి రత్నకుమారి, కటుకుల వీరలక్ష్మి, ఉప్పలపాటి నీలవేణి, కడుగుల బేబీ తదితరులు మాట్లాడుతూ, 2005లో వైఎస్ రాజశేఖరరెడ్డి పేదలకు ఎకరం చొప్పున భూమి ఇచ్చారని తెలిపారు. ఇప్పటివరకు తమకు హద్దులు కేటాయించలేదన్నారు. తమ భూముల్లో గోపాలపురం మండలంలోని గోపవరానికి చెందిన రేలంగి వెంకటేశ్వరరావు, పిట్టా రామారావు, శీలబోయిన పాపారావు తదితరులు అక్రమించుకుని తమ పంటలను తరలించుకుపోతున్నారని ఆరోపించారు. తమపై దౌర్జన్యానికి దిగుతున్నారని వాపోయారు. గత 20 ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదన్నారు. తహసీల్దార్ మీ పంటతో మాకు సంబంధం లేదని చెబుతున్నారని ఆవేదన చెందారు. తమ భూములకు హద్దులు చూపాలని అధికారులను కోరుతున్నారు.

గోదావరి హారతి నిర్వహణపై సమీక్ష



కొవ్వూరులో గోదావరి హారతిపై సమావేశం నిర్వహించిన ఆర్డీవో సుస్మిత

తాళ్లపూడి (కొవ్వూరు): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గోదావరి హారతి విజయవంతం చేయాలని ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో అక్టోబర్ 27న నిర్వహించనున్న గోదావరి హారతి కార్యక్రమం ఏర్పాట్లపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అధ్యక్షతన పురప్రముఖులు, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ, గోదావరి హారతి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. వీక్షకుల కోసం కూర్చునే సిట్టింగ్ ఏర్పాట్లు పెంచాలని, మూడు పండళ్లతో విశాలమైన వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు. గత ఏడాది ఎదురైన లోపాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి కార్యక్రమం మరింత ప్రతిష్ఠాత్మకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీటీడీ నుంచి ఉత్సవమూర్తులను తీసుకొచ్చి సంప్రదాయ పద్ధతిలో హారతి నిర్వహిస్తామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. మాజీ కౌన్సిలర్ బర్ల శ్రీను మాట్లాడుతూ, తిరుపతి పెద్దలు స్థానిక నాయకులతో సంప్రదింపులు జరపడం అవసరమని అభిప్రాయపడ్డారు. దానికి స్పందించిన ఆర్డీవో రాణి సుస్మిత, ఇది లోకకల్యాణం కోసం నిర్వహిస్తున్న పవిత్ర కార్యక్రమం. మనమందరం సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సురపునేని చిన్న, పిల్లలమర్రి మురళీకృష్ణ, పురపాలక సంఘ మేనేజర్ భరత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో, దేవాదాయ శాఖ అధికారులు, ఫైర్ ఆఫీసర్, దాస సాహిత్య ప్రాజెక్టు కోఆర్డినేటర్లు శివరామకృష్ణ, కలగర శ్రీనివాసులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికీ మద్యం పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న కూచిపూడి సతీష్

దేవరపల్లి: ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కూచిపూడి సతీష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని గౌరీపట్నంలో బుధవారం రాత్రి గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజాం అని ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. ఏడాదిన్నర పరిపాలనలో ఒక్క కొత్త పింఛన్ ఇవ్వలేని ఆయన ప్రచార ఆర్భాటం మాత్రం చేసుకుంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుందని, ఇంటింటికీ మద్యం సరఫరా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఏఎంసీ మాజీ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కుసులూరి వెంకట సతీష్, ఎంపీటీసీ సభ్యులు కరుటూరి నిత్యానందం, పార్టీ శ్రేణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాన్ని పట్టించుకోరా!



సమిశ్రగూడెంలో ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం పైనుంచి నిర్మిస్తున్న ఆర్వోబీ

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెంలో పశ్చిమ డెల్టా ప్రధాన కాలువపై ఆర్వోబీ నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అయితే 80 ఏళ్ల క్రితం నిర్మించిన పురాతన సమిశ్రగూడెం శ్రీపర్వత వర్ధిని ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయం (శివాలయం)పై నుంచి ఈ ఆర్వోబీ నిర్మాణం చేపట్టడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు చేయడానికి ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా అధికార కూటమి పార్టీల నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖాధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడుతున్నారు. కార్తికమాసం వచ్చిందంటే భక్తులతో కిటకిటలాడే ఈ శివాలయంలో ఆర్వోబీ నిర్మాణంతో ఈ ఏడాది స్నానాలు చేసేందుకు స్నానాల రేవు కూడా అందుబాటులో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు ఏటా మహా శివరాత్రి వెళ్లిన రెండో రోజున స్వామి వారి విగ్రహంపై సూర్య కిరణాలు పడటం ఈ ఆలయం ప్రత్యేకత. ఇప్పటికైనా శివుడి దర్శనానికి వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లతో పాటు శివాలయం పునర్నిర్మాణంపై తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

క్వారీ ఏర్పాటుపై ప్రజాభిప్రాయ సేకరణ

దేవరపల్లి: మండలంలోని లక్ష్మీపురంలో నల్లరాతి క్వారీ ఏర్పాటుకు మెడ గంగాధరం అనే వ్యక్తి పర్యావరణ అనుమతుల కోసం చేసుకున్న దరఖాస్తుపై బుధవారం దుద్దుకూరులో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత పాల్గొని మాట్లాడారు. లక్ష్మీపురం గ్రామంలో సర్వే నెంబరు 75/1,78/2ఎ, 80,81లో 4.684 హెక్టార్ల అటవీయేతర పట్టా భూమిలో ఆర్డీనరీ ఎర్త్, రోడ్ మెటల్, క్వారీ ఏర్పాటుకు పర్యావరణ నియంత్రణ మండలికి గంగాధరం దరఖాస్తు చేసుకోగా, నియంత్రణ మండలి ఆదేశాల మేరకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు ఆమె తెలిపారు. అభిప్రాయ సేకరణలో పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, లక్ష్మీపురం గ్రామస్తులు, క్వారీ కార్మిక సంఘాల నేతలు, క్వారీ క్రషర్ల యూనియన్ నాయకులు తమ అభిప్రాయాలను తెలిపినట్టు వెల్లడించారు. వీటిని ఆంధ్రప్రదేశ్ పర్యావరణ నియంత్రణ మండలికి పంపిస్తామని ఆమె పేర్కొన్నారు.

పేకాడుతున్న 12 మంది అరెస్ట్

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలోని లోహియ నగర్‌లో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ఎల్.బాలాజీ సుందరరావు బుధవారం తెలిపారు. చిన్నయ్య పశువుల పాకలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. నిందితుల నుంచి రూ.51,830 స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

నిడదవోలు: పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో బుధవారం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మెప్మా సిటీ మిషన్ మేనేజర్ జ్యోతి మాట్లాడుతూ, మహిళలు ప్రతిరోజు క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం చేయాలన్నారు. ఆకుకూరలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. చేతుల పరిశుభ్రతను పాటిస్తే డయేరియా, కలరా, ఊపిరితిత్తుల వ్యాధులు, మలేరియా వంటి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. మెప్మా ఆర్పీలు చేతుల పరిశుభ్రతపై అవగాహనతో ఉండి డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీవోలు సుజాత, సింధు, ఆర్పీలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించాలి

గోపాలపురం: నూతన ఓటర్ల జాబితా, కొత్త ఓటర్ల చేర్పులు, చనిపోయిన ఓట్లు తొలగింపు అంశాలపై వివిధ రాజకీయ పార్టీ నాయకులతో బుధవారం తహసీల్దార్ కె.సాయి ప్రసాద్ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ, రాజకీయ ప్రజాప్రతినిధులు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల వివరాలు ఆయా బూత్ లెవెల్ అధికారులకు అందజేయాలని సూచించారు. పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బీఎల్‌వోలు ప్రతి ఇంటికి వచ్చి వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. బూత్ లెవెల్ అధికారులకు ఆయా గ్రామాల రాజకీయ పార్టీ నాయకులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, సంబంధిత అధికారులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

దుకాణదారులు నిబంధనలు పాటించాల్సిందే



గోపాలపురంలో దుకాణాల సముదాయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గోపాలపురం: బాణసంచా దుకాణదారులు ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కొవ్వూరు ఫైర్ స్టేషన్ అధికారి ఏవీ ఎస్ఎన్ఎస్ వేణు అన్నారు. మండలంలోని గోపాలపురం, వేళ్లచింతలగూడెం, చిట్యాల, దొండపూడి, కొవ్వూరుపాడు, కరిచర్లగూడెం గ్రామాల్లో దీపావళి సందర్భంగా ఏర్పాటు చేయనున్న దుకాణాల సముదాయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలకు ఇరువైపులా రెండు డ్రమ్ములతో నీళ్లు, ఇసుకను ఏర్పాటు చేయాలన్నారు. అగ్ని ప్రమాదం జరగకుండా మంటలను ఆర్పే యంత్రాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎస్సైలు పి.మనోహర్, పి.శివ గణేష్, తహసీల్దార్ కె.సాయి ప్రసాద్ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

దుకాణాల స్థలం పరిశీలన

తాళ్లపూడి: గ్రామంలో ఏటా దీపావళికి ఏర్పాటు చేసే బాణసంచా దుకాణాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు వెళ్లడంతో అధికారులు విచారణ ప్రారంభించారు. పోలీసులు, ఫైర్, రెవెన్యూ అధికారులు స్థల సేకరణలో ఉన్నారు. తాళ్లపూడిలో బుధవారం పోలీసులు, రెవెన్యూ, ఫైర్ శాఖల అధికారులు గ్రామంలోని పలు ఖాళీ స్థలాలు పరిశీలించారు. అసలు ఫిర్యాదు చేసిన వారు ప్రజలా? కావాలనే ఎవరైనా చేశారా? అనే అనుమానాలు అటు అధికారుల్లోనూ, ఇటు బాణసంచా దుకాణదారుల్లో చర్చనీయాంశమైంది. దుకాణాల ఏర్పాటుకు తగిన రక్షణ సదుపాయాలు ఉండాలని, షాపుల వారు నిబంధనలకు లోబడి షాపులు నిర్వహించాలన్నారు.

బాలికల భవితకు భరోసానిద్దాం

నల్లజర్ల: ఆడపిల్లల్ని రక్షించండి–ఆడపిల్లల్ని చదివించండి అంటూ పోతవరం పీహెచ్‌సీ డాక్టరు సీహెచ్ శైలజ నినదించారు. భేటీ బచావో– భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బుధవారం పోతవరం జడ్పీ హైస్కూల్లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు వైద్యురాలు మాట్లాడుతూ, బాలికల సంఖ్య పెరిగే విధంగా చూడాలన్నారు. వారికి పౌష్టికాహారం అందించడం, ఆడపిల్లల్ని లైంగిక వేధింపుల నుంచి రక్షించాలని, ఆడపిల్లలకు సురక్షితమైన, అనుకూలమైన వాతావరణం కల్పించాలన్నారు.